క్లుప్తంగా

అభినందనలు



కుమారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ త్రినాథ్

వీరఘట్టం: జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సెకెండియర్ విద్యార్థిని పి.కుమారిని ప్రిన్సిపాల్ డీజీఎస్వీ త్రినాథ్ బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి పోటీల్లో పాల్గొంటే మనలో దాగిఉన్న ప్రతిభాపాటవాలు బయట పడతాయన్నారు.

ఎంపీడీవోగా శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు



బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఎంపీడీవోగా ఎల్.శ్రీనివాసరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన పి.త్రివిక్రమరావుకు డ్వామా ఏపీడీగా పదోన్నతి రావటంతో వెళ్లిపోయారు. దీంతో ఆయన స్థానంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు విధుల్లో చేరిన శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

రైతులందరికీ యూరియా

గుమ్మలక్ష్మీపురం: ఇరిడి రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులందరికీ యూరియా ఎరువును అందించడం జరుగుతుందని ఏవో పి.శంకరరావు అన్నారు. ఇరిడి గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం జరిగిన యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన తహసీల్దార్ ఎస్.శేఖర్, ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావుతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఒక్కో రైతులకు ఒక్కో బస్తా యూరియా చొప్పున్న అందజేయడం జరుగుతుందని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులను వేసుకోవాలంటూ పలు సూచనలు చేశారు. మండలానికి మొత్తం 685 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 403 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. వచ్చిన యూరియాను రైతు సేవా కేంద్రాల వారీగా రైతులకు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు.

పరామర్శ..



శకుంతలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

భామిని: మండలంలోని బిల్లుమడకు చెందిన సిగడాన శకుంతలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట బిల్లుమడ సర్పంచ్ సిగడాన రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ సిగడాన రాజు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, పసుకుడి సర్పంచ్ భార్గవనాయుడు, రైతు సంఘ అధ్యక్షుడు కాగితాపల్లి కృష్ణారావు, తదితరులున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థుల విద్యాభివృద్ధిని పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో రజని

కొమరాడ: వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యే క శ్రద్ధ వహించాలని ఏటీడబ్ల్యూవో రజని అన్నారు. మండలంలోని ఎండభద్ర గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ మెనూ సక్రమంగా అమలవుతుందా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. విద్యాభివృద్ధిపై ఆరా తీశారు. పలు రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

పాలకొండ: త్వరలో జరగనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 13, 14 తేదీల్లో పాలకొండ పట్టణంలో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఈ మహాసభల్లో పాల్గొని భవిష్యత్ కార్యాచరణ చేపడతారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నామన్నారు.

గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వవద్దు

- ఎలుగుల మెట్టపై ప్రజాభిప్రాయ సేకరణ
- తవ్వకాలను వ్యతిరేకించిన రెండు గ్రామాల ప్రజలు

పార్వతీపురం రూరల్:

మండలంలో గ్రానైట్ తవ్వకాలకు ఎలుగుల మెట్ట కొండను అప్పగించేందుకు ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా బుధవారం గుట్టుచప్పుడు కాకుండా కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు మెస్సర్స్ వెంకట సాయి గ్రానైట్స్ అనే కంపెనీకి ఈ కొండపై గ్రానైట్ తవ్వకాలకు అనుమతి మంజూరు చేసినట్లు తెలుస్తోంది. హెచ్ కారాడవలస సమీపంలో, పెదబొండపల్లితో పాటు రెండు గ్రామాల రైతుల భూములను ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 62/1లో 1.385 హెక్టార్లు, సర్వే నంబర్ 63లో 4.135 హెక్టార్ల విస్తీర్ణంలో తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ క్రమంలో ఎలుగుల మెట్టపై కలర్ గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు మంజూరయ్యాయి. హెచ్.కారాడవలస గ్రామం సమీపంలో ఉన్న కొండకు దగ్గరలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు సమీప రెండు గ్రామాల ప్రజలకు ముందుగా ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదు. డీఆర్ఓ కె.హేమలత, పర్యావరణ శాఖ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తొలుత కొంతమంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గ్రానైట్ తవ్వకాలకు అనుకూలంగా మాట్లాడేందుకు ప్రయత్నించారు. దీనిపై పెదబొండపల్లి ఎంపీటీసీ ప్రతినిధి మండల పకీర్ నాయుడు, కారాడవలసకు చెందిన మహిళా నాయకురాలు పెద్దిరెడ్ల శ్రీవాణితో పాటు రైతులు, గ్రామస్తులు ముక్తకంఠంతో అడ్డుకున్నారు. తమ గ్రామంతో సంబంధం లేని వ్యక్తులు ఇక్కడ స్వచ్ఛంద సంస్థల పేరిట మాట్లాడొద్దని వ్యతిరేకించారు.

డీఆర్ఓకు వినతిపత్రం అందజేత

రెండు గ్రామాలకు చెందిన కొండ చుట్టూ వందలాది ఎకరాల భూములు ఉన్నాయని, తవ్వకాలు జరిపితే తమ జీవితాలు నాశనమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తవ్వకాలకు తాము అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. పోలీసుల భద్రత నడుమ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కొద్ది సమయంలోనే సమాచారం తెలియని రెండు గ్రామాల ప్రజలు ఆ నోటాఈ నోటాతెలుసుకుని, అక్కడికి చేరుకుని సభ జరగకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనంతరం డీఆర్ఓ హేమలతకు ఆయా గ్రామాల పెద్దలు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వీఆర్ఓ హేమలత మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

అక్రమ క్వారీలతో ఆకలి తీరలేదా..

పార్వతీపురాన్ని పాలిస్తున్న పాలకులు, అధికారులు కొండల్ని కూడా వదిలేలా లేరని కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు మాట్లాడుతూ పార్వతీపురం మండలంలోని హెచ్.కారాడవలస, పెదబొండపల్లి గ్రామ రెవెన్యూలో గల ఎలుగుల మెట్టపై గ్రానైట్ తవ్వకాలకు వెంకట్ సాయి గ్రానైట్స్ కంపెనీకి అనుమతి ఇచ్చేందుకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించడంపై ధ్వజమెత్తారు. ఇప్పటికే అధికారులు, పాలకులు కంపెనీతో కుమ్మక్కయ్యారని నామమాత్రపు కార్యక్రమంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారని ఆరోపించారు. ప్రజల ఘోష తప్ప అనుమతులు ఆగే పరిస్థితి ఉండదని వారు జోస్యం చెప్పారు. పార్వతీపురం ప్రాంతం ఇప్పుడు మైనింగ్ రాక్షసుల కంటబడి నాశనమయ్యే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని, పర్యావరణాన్ని సమతుల్యం చేసి సకాలంలో వర్షాలు కురిసేందుకు ఉపయోగపడే కొండలు ఇప్పుడు మైనింగ్ భూతానికి బలవుతున్నాయన్నారు. ఒకప్పుడు సకాలంలో వర్షాలు కురిసే పార్వతీపురం ప్రాంతంలో ఇప్పుడు వర్షాలు కురిసే పరిస్థితి లేదని, పార్వతీపురం ప్రాంతంలో అక్రమ క్వారీలు రాజ్యమేలుతున్నాయని వాపోయారు. కళ్ల ముందే నిబంధనలు మీరి తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత పాలకులు, అధికారులు వారి స్వలాభమే చూసుకుంటున్నారు తప్ప వాటిని అడ్డుకునే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో కోలా కిరణ్ కుమార్, తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎలుగుల మెట్టపై గ్రానైట్ తవ్వకాలు వద్దంటూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న హెచ్ కారాడవలస, పెదబొండపల్లి గ్రామస్తులు



డీఆర్ఓ కె.హేమలత, పొల్యూషన్ బోర్డ్ అధికారి కరుణశ్రీలకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సహజ వనరులు అమ్మడమే ప్రభుత్వ విధానమా?



పాలక రంజిత్ కుమార్

ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా గ్రానైట్ కంపెనీలకు సహజ సంపదను అమ్మడమే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విధానమా? అని గిరిజన సంక్షేమం సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ప్రశ్నించారు. పార్వతీపురం మండలం హెచ్ కారాడ వలస, పెదబొండపల్లి రెవెన్యూ పరిధిలోని 'ఎలుగుల మెట్ట'ను గ్రానైట్ కంపెనీలకు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని సేకరించిన సందర్భంగా ప్రజలందరూ గ్రానైట్ తవ్వకాలు వద్దని అభిప్రాయాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో తక్షణమే తవ్వకాల ఆలోచన మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే మండలంలోని బోడికొండ, బడి దేవరమ్మ కొండ మైనింగ్ చేయడం వల్ల పర్యావరణానికి, తాగునీరు, వ్యవసాయానికి ముప్పు వాటిల్లుతుందని రంజిత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

రమేష్ సేవలు అభినందనీయం

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



పదోన్నతిపై వెళ్తున్న రమేష్‌ను అభినందిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



లోచర్ల రమేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పార్వతీపురం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

పార్వతీపురం రూరల్: జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా పనిచేసిన లోచర్ల రమేష్ సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రశంసించారు. ఉప సంచాలకుడిగా పదోన్నతి పొంది బదిలీపై గుంటూరు వెళ్తున్న రమేష్‌ను బుధవారం తన చాంబర్‌లో దుశ్శాలువతో ఘనంగా కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాత్రికేయులను సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయడంలోనూ, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను పాత్రికేయులకు అందించడంలో, పత్రికల్లో వచ్చిన ప్రతికూల వార్తలను అధికారులకు చేరవేసి, వారి నుంచి స్పందన తీసుకోవడంలో మంచి పనితీరు కనబరిచారన్నారు. ఈ సందర్భంగా డీపీఆర్ఓ ఎల్.రమేష్ మాట్లాడుతూ పునర్విభజన అనంతరం జిల్లాలో పనిచేయడం సంతృప్తిని ఇచ్చిందని, ఒక శాఖకు మంచి పేరు రావాలంటే దిగువస్థాయి సిబ్బంది నుంచి అధికారి వరకు సమష్టి కృషితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్, సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజినీర్ ఎం.గజపతిరావు, డివిజనల్ పౌర సంబంధాల అధికారి జీవీ రవికుమార్, సహాయ సమాచార ఇంజినీర్ సీహెచ్.శ్రీనివాస రావు, జూనియర్ సహాయకులు ఎస్.సుజాత, టైపిస్ట్ రాధారాణి సాహు, లక్ష్మణ్, నిర్మల కుమారి, గౌరీశ్వరి, లీలవేణి, మోహిని, షరీఫ్, ప్రవీణ్, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను అభివృద్ధి పరచండి



మోడల్ ప్రైమరీ పాఠశాలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి పరిచేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు మండలంలోని మిర్తివలస మోడల్ ప్రైమరీ పాఠశాలను ఆయన బుధవారం పర్యవేక్షించారు. విద్యార్థులకు ఇప్పటివరకు పూర్తయిన పాఠ్యాంశాలను విద్యార్థులతో చదివించారు. నోట్‌బుక్స్ పరిశీలించి, చేతిరాత చక్కగా ఉండేందుకు తగిన మెలకువలు తెలియచేశారు. తరగతి గదుల్లో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించి పాఠ్యాంశాలు బోధించాలని సూచించారు. తరగతి గదిలో ఉన్న మెటీరియల్‌ను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల రోల్ పెంచేందుకు కృషిచేయాలని కోరారు. రికార్డులు పరిశీలించి, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఆరాతీశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మావుడి శ్రీనివాసులు నాయుడికి శుభాకాంక్షలు



మావుడి శ్రీనివాసులు నాయుడికి శుభాకాంక్షలు తెలిపిన సాలూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా మక్కువ జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసులు నాయుడు ఇటీవల నియమితులయ్యారు . ఈ సందర్భంగా ఆయనను సాలూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ భరత్ శ్రీనివాస్, పెద్దింటి మాధవరావు, నెమలి పిట్ట కల్యాణ్, బీసు,రమణ తదితరులు పూలమాల వేసి దుశ్శాలువాలతో బుధవారం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వారం పాటు టీచర్ల నిరసన

సాలూరు: కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలైనా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్య ఒకటి కూడా పరిష్కరించలేదని ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.వి.గౌరీశంకర్ దుయ్యబట్టారు. ఈ మేరకు బుధవారం ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు ప్రభాకర్, సాలూరు మండల బాధ్యులు అరంగి చంద్రశేఖర్ అంబటి సన్యాసిరావులు సాలూరు నియోజకవర్గ కేంద్రానికి సంబంధించి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులందరూ రేపటి నుంచి వారం రోజుల పాటు షెడ్యూల్ ప్రకారం నిరసనలు తెలపాలని కోరారు. ఈ నెల 11న నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులకు హాజరవాలని సూచించారు. 12న మండల కేంద్రంలో నిరసన ప్రదర్శన చేపట్టాలని పేర్కొన్నారు. 13, 14వ తేదీల్లో ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయాలన్నారు. 15న పాత తాలూకా కేంద్రాలలో, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శన చేయాలన్నారు. 17న సీఎం, సీఎస్‌లకు వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా వినతులు పంపించాలని చెప్పారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ, ఐఆర్, పీఆర్సీలను ప్రభుత్వం కనీసం పట్టించు కోవడం లేదని, బకాయిలు వెంటనే చెల్లించి, సీపీఎస్ రద్దు, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేసి బోధనేతర పనులు తొలగించాలని డిమాండ్ చేస్తూ వారం రోజుల పాటు వివిధ రూపాల్లో నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.

గిరిజనుల అవస్థలు



మృతదేహాన్ని మోస్తూ గెడ్డను దాటుతున్న కారివలస గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొండవాడ పంచాయతీ కారివలస గ్రామానికి చెందిన గిరిజనులు శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో గల గెడ్డ వద్ద కల్వర్టు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఆ గ్రామానికి చెందిన శ్మశాన వాటికకు వెళ్లాలంటే దారి మధ్యలో ప్రవహించే గెడ్డను దాటి వెళ్లాల్సిన పరిస్థితి. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. తప్పని పరిస్థితుల్లో మరే మార్గం లేకపోవడంతో నడుములోతు మునిగే గెడ్డ మీదుగానే మృతదేహాలను శ్మశాన వాటికకు తరలిస్తూ అగచాట్లు పడుతున్నారు. వర్షాకాలంలో గ్రామస్తులు ఎవరైనా చనిపోతే ఇదే పరిస్థితులు నెలకొంటున్నాయని, ప్రభుత్వ అధికారులు స్పందించి గెడ్డ వద్ద కల్వర్టును నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కలుపు ఉంటే కలదు నష్టం

- సాగులో నివారణ అత్యంత కీలకం
- యాజమాన్య పద్ధతులతో అధిక ప్రయోజనాలు

బలిజిపేట:

వరిసాగులో రైతులకు కలుపుతీత ప్రధానమైనది. సకాలంలో కలుపుతీత వల్ల నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు వచ్చే అవకాశాలున్నాయి. ఎక్కువగా వెదజల్లు విధానంలో సాగు చేయడం వల్ల సాధారణంగా కలుపు అధికంగా ఉంటుంది. కలుపును వదిలేస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వరి పంటలో కలుపు నివారించడం ద్వారా నాణ్యమైన పంటలు పండించేందుకు అవకాశం ఉంటుంది. ప్రధానంగా సాగుచేసే పంటల్లో పెరిగే ఇతర గడ్డి మొక్కలనే కలుపు అంటారు. సాగు భూముల్లో ఈ మొక్కలు ప్రధాన పంటకంటే త్వరితగతిన పెరిగి, పోషకాలను, ఎరువులను స్వీకరించి దిగుబడిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. కలుపును నివారించకుంటే తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండడంతో పాటు ఎరువులు, పురుగు మందుల వినియోగం భారీగా పెరిగిపోతుంది. నాణ్యమైన పంటలు పండించడలో అధిక దిగుబడులు సాధించడంలో విఫలమయ్యే పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది. కలుపు మొక్కలో సాధారణంగా పంటకు ఎక్కువ హాని కలిగించే వాటిల్లో ఊదర, వెడల్పాకు, తుంగ, ఏక వార్షిక గడ్డి జాతులు ఉంటాయి. వాటి నివారణకు సాధ్యమైనంత మేరకు వ్యవసాయశాఖ సూచనలు మేరకు క్రిమి సంహారక మందులను పిచికారీ చేస్తే సత్ఫలితాలు ఉంటాయి. సాధారణంగా రైతులు పొలాల్లో నిర్ణీత సమయంలో కూలీలతో కలుపును తీయించేవారు. కూలీల కొరత, రేట్లు గణనీయంగా పెరిగిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబిస్తున్నారు. దీనివల్ల కలుపునివారణకు అనేక మందులు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించకుండా, రసాయన, క్రిమి సంహారక మందులను అధికంగా వినియోగిస్తే లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు ఏవిధమైన మందులు ఎంత మోతాదులో వినియోగించాలో రైతులకు అవగాహన ఉంటే కలుపును పూర్తిగా నిర్మూలించి అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.



పొలంలో కలుపు తీస్తున్న కూలీలు

కలుపు నివారణ–అంతర కృషి

వరిసాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కలుపు మొక్కల నివారణకు ప్రత్యేక క్రిమి సంహారక మందులను వినియోగించాలి. వరినాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల్లో ప్రెటిలాకోర్ ద్రావణం 500మి.లీ. లేదా ఆక్సాడ యార్జిల్ 20గ్రాముల మందును నీటిలో కరిగే గుళికలతో మిశ్రమం చేసి చల్లాలి. పెట్ సల్ఫ్యూరాన్ లేదా క్లోరీ మ్యూరాన్ ఈథేల్ ఎనిమిది గ్రాముల మందును కలుపు రెండు నుంచి నాలుగు ఆకుల దశలో పిచికారీ చేయాలి. కలుపు నాలుగు ఆకుల దశలో ఉన్నప్పుడు బిస్పైరీబాక్ సోడియం లీటరు ద్రావణంలో ఎకరాకు 100మి.లీ. మందును కలిపి పిచికారీ చేయాలి. పెనాక్సులం లేదా సైహాలోపాస్ బ్యూటైల్ ద్రావణాన్ని 900మి.లీ. పిచికారీ చేస్తే అన్ని రకాల కలుపు మొక్కలు నిర్మూలిస్తుంది.

యాజమాన్య పద్ధతులు కీలకం

కలుపు నివారణలో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు. విత్తనం నాటిన నాటినుంచి కలుపు నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు తీసుకోకపోతే పంట తీవ్రంగా దెబ్బతినే అవకాశాలున్నాయి.

శివగణేష్, ఏఓ, బలిజిపేట

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల కలుపు మందులు లభిస్తున్నాయి. వరి పొలాల్లో పిచికారీ చేసే క్రిమి సంహారక మందును ఎంత మోతాదులో, ఏ సమయంలో, ఎలా వాడాలో అన్ని వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతే వాడాలి. సిఫారసు చేయని, పూర్తి వివరాలు తెలియని కలుపు మందులను ఎట్టి పరిస్థితుల్లో వాడరాదు. అలా వాడితే కలుపు నిర్మూలన సరిగ్గా జరగకపోగా, కొన్ని సందర్భాల్లో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కలుపు మందును ఇతర సస్యరక్షణ మందులతో కలిపి వినియోగించరాదని, కలుపు నివారణకు ఎల్లప్పుడూ ఒకే మందు వాడరాదని అధికారులు సూచిస్తున్నారు.

మౌలిక వసతుల పరిశీలన



బిళ్లమానుగూడలో గిరిజన సమస్యలను తెలుసుకుంటున్న మాస్టర్ ట్రైనీ

జియ్యమ్మవలస: మండలంలోని అర్నాడ పంచాయతీ బిళ్లమానుగూడ, కొత్తగూడ గిరిజన గ్రామంలో ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామ సర్వే చేసి మౌలిక వసతులు, అవసరాలు గుర్తించారు. విలేజ్ ప్లాన్, విలేజ్ విజన్ మ్యాప్‌ను తయారు చేశారు. గ్రామస్తులు మంచినీటి సౌకర్యం, పక్కా ఇళ్లు, సిమెంట్ రోడ్డు, లింక్ రోడ్లు, పాఠశాల భవనం, వ్యవసాయ పంపుసెట్లు, త్రీఫేజ్ విద్యుత్, కమ్యూనిటీ హాల్, రచ్చబండ మొదలైన 25 అంశాలను తెలియపరిచారని మండల మాస్టర్ ట్రైనీ అల్లు రవి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి



ఉల్లిబద్రలో విరాళాలను సేకరిస్తున్న ట్రస్టు సభ్యులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని టీటీడీ ఆలయ అభివృద్ధి ట్రస్టు కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో విరాళాలను సేకరించేందుకు కమిటీ సభ్యులు దాతలను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు నుంచి రూ.18,300లు విరాళాలను సేకరించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర చిన తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం పునః నిర్మాణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు టి.పకీరునాయుడు, ఎం.పకీరునాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.